# ఐపీఎల్ పాసుల వివాదంపై విజిలెన్స్ విచారణ

**సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు**

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) వివాదంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్‌ఆర్‌హెచ్ చేసిన ఆరోపణలపై ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ) వివరాలు సేకరించగా ఈ విషయం సీఎం దృష్టికి వెళ్లింది. ఈ అంశంపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాల్సిందిగా విజిలెన్స్ డీజీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డిని ఆదేశించారు. ఎస్‌ఆర్‌హెచ్ యాజమాన్యాన్ని పాసుల కోసం ఇబ్బందిపెడితే చర్యలు తీసుకుంటామని హెచ్‌సీఏను ఆయన హెచ్చరించారు. ఇదిలాఉండగా హెచ్‌సీఏ భూముల విషయాన్ని డైవర్ట్ చేసేందుకే సీఎం.. హెచ్‌సీఏ రాగం ఎత్తుకున్నారని సోషల్ మీడియాలో విమర్శలు వినిపిస్తున్నాయి.

## మా పరువుకు భంగం కలిగించొద్దు

**కూర్చుని మాట్లాడుకుందాం: హెచ్‌సీఏ**



అదనపు పాసుల కోసం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు తమను బెదిరిస్తున్నారని, ఇది ఇలాగే కొనసాగితే హైదరాబాద్‌ను వీడి వెళ్లిపోతామని హెచ్చరించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) ఆరోపణలపై హెచ్‌సీఏ స్పందించింది. ఎస్‌ఆర్‌హెచ్ విడుదల చేసిన ఈ-మెయిల్‌కు హెచ్‌సీఏ సుదీర్ఘ వివరణ ఇస్తూ తమ పరువుకు భంగం కలిగించేలా చేయడం సబబు కాదని పేర్కొంది. 'కోటాకు మించి మిమ్మల్ని (ఎస్‌ఆర్‌హెచ్) అదనపు పాసుల కోసం మేము (హెచ్‌సీఏ) ఎప్పుడూ అడగలేదు. గత రెండు మ్యాచ్‌లలో మీరు మాకు ఇచ్చింది 3,880 కాంప్లిమెంటరీ పాస్‌లే. ఎఫ్-12 ఏ బాక్సులో సామర్థ్యానికి మించి మీరు 50 టికెట్లు ఇస్తామంటే మేము ఆ బాక్సులో 30 ఇచ్చి మిగిలిన 20 పాసులను మరో బాక్సులో సర్దుబాటు చేయమన్నాం. దానికి ఈనెల 27న ఎస్‌ఆర్‌హెచ్ ప్రతినిధులు కిరణ్, శరవాణన్, రోహిత్ అంగీకరించారు. ముందు అంగీకరించి తర్వాత ఇప్పుడు బ్లాక్ మెయిల్ చేస్తున్నారనే అర్థంతో ఈ-మెయిల్‌లో ఆరోపణలు చేయడం ఎంతమాత్రమూ ఆమోద యోగ్యం కాదు. అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు తన వ్యక్తిగత అవసరాల నిమిత్తం అదనంగా మరో 10 శాతం టికెట్లు ఇవ్వాలని ఎస్‌ఆర్‌హెచ్‌ను ఎప్పుడూ అడగలేదని స్పష్టం చేస్తున్నాం. ఇక స్టేడియం ఆధునీకరణ పనుల విషయంలోనూ మీరు గతంలో ఇచ్చిన మాటను నిలుపుకోలేదు. ఐపీఎల్‌ను విజయవంతం చేయాలనే సదుద్దేశంతో కొన్ని సమస్యలున్నా మేము మౌనంగా ఉంటున్నాం. ఇప్పటికైనా ఈ-మెయిల్స్‌కు స్వస్తి చెప్పి ఎస్‌ఆర్‌హెచ్ యాజమాన్యం, సిబ్బందితో మాట్లాడుకుని సమస్యలు పరిష్కరించుకునేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. విశాల దృక్పథంతో చర్చలకు ముందుకు రావాలని కోరుతున్నాం' అని హెచ్‌సీఏ లేఖలో పేర్కొంది.

# టీడీసీఏ వన్డే సిరీస్ అమెరికా కైవసం



హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 వన్డే సిరీస్‌ను అమెరికా యూత్ క్రికెట్ అకాడమీ కైవసం చేసుకుంది. సోమవారం జరిగిన ఫైనల్‌లో అమెరికా జట్టు.. 57 పరుగుల తేడాతో టీడీసీఏ లెవన్‌పై గెలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన అమెరికా 297 పరుగులు చేయగా ఛేదనలో టీడీసీఏ 240 రన్స్‌కు ఆలౌట్ అయింది. ఫైనల్ అనంతరం టీడీసీఏ వ్యవస్థాపక చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. తమపై నమ్మకముంచి అమెరికాలోని వివిధ రాష్ట్రాల క్రికెటర్లను తెలంగాణ గ్రామీణ క్రికెటర్లతో ఆడేందుకు తీసుకొచ్చిన కొలిపాక అరుణ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడి గ్రామీణ క్రికెటర్లకు టీమ్ ఇండియాకు ఆడించడమే టీడీసీఏ లక్ష్యమని ఆయన అన్నారు.

# ముంబై మొదలెట్టింది

**కోల్‌కతాపై ఘనవిజయం ● అరంగేట్రంలో అశ్వినీ అదుర్స్ ● మెరిసిన రికెల్టన్**



అశ్వినీ (4/24)

ముంబై: ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన జట్టుగా ఉన్న ముంబై ఇండియన్స్ 18వ ఎడిషన్‌లో టైటిల్ వేటకు శ్రీకారం చుట్టింది. రెండు వరుస పరాభవాల అనంతరం ఆ జట్టు.. సోమవారం వాంఖడే స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) పై 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. వాంఖడేలో కేకేఆర్‌పై ఘనమైన రికార్డు కలిగిన ముంబై.. ఆ పరంపరను కొనసాగిస్తూ సూపర్ విక్టరీతో బోణీ కొట్టింది. ఐపీఎల్‌లో అరంగేట్ర మ్యాచ్ ఆడిన యువ పేసర్ అశ్వినీ కుమార్ (4/24), దీపక్ చాహర్ (2/19) పేస్ దెబ్బకు కేకేఆర్.. 16.2 ఓవర్లలో 116 పరుగులకే కుప్పకూలింది. అంగ్‌క్రిష్ రఘువంశీ (16 బంతుల్లో 26, 3 ఫోర్లు, 1 సిక్స్), రమణ్‌దీప్ సింగ్ (12 బంతుల్లో 22, 1 ఫోర్, 2 సిక్సర్లు) మిగిలిన బ్యాటర్ల కంటే ఉన్నంతలో మెరుగ్గా రాణించారు. ఛేదనలో ర్యాన్ రికెల్టన్ (41 బంతుల్లో 62 నాటౌట్, 4 ఫోర్లు, 5 సిక్సర్లు), సూర్యకుమార్ యాదవ్ (9 బంతుల్లో 27 నాటౌట్, 3 ఫోర్లు, 2 సిక్సర్లు) వేగంగా ఆడారు. అశ్వినీ కుమార్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

### దంచిన రికెల్టన్



రికెల్టన్ (62*)

స్వల్ప ఛేదనలో ముంబైకి ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన రోహిత్ (13) మరోసారి నిరాశపరచగా యువ ఓపెనర్ రికెల్టన్ మాత్రం చెలరేగి ఆడాడు. జాన్సన్ 3వ ఓవర్లో 4, 6తో పరుగుల వేట ఆరంభించిన ఈ దక్షిణాఫ్రికా కుర్రాడు.. హర్షిత్ రాణా నాలుగో ఓవర్లో 4, 6, 4 బాదాడు. నరైన్ పదో ఓవర్లో భారీ సిక్సర్ కొట్టి అర్ధ సెంచరీ పూర్తిచేసిన అతడు అదే ఓవర్లో లాంగాన్ మీదుగా మరో సిక్సర్ బాదాడు. విల్ జాక్స్ (16) విఫలమైనా నాలుగో స్థానంలో వచ్చిన సూర్య దూకుడుగా ఆడి మ్యాచ్‌ను ముగించాడు. ఎదుర్కొన్న రెండో బంతినే సిక్సర్‌గా మలిచిన మిస్టర్ 360.. రస్సెల్ 13వ ఓవర్లో 4, 4, 6తో లాంఛనాన్ని పూర్తిచేశాడు.

### కోల్‌కతా కట్టడి

బ్యాటింగ్ వైఫల్యంతో కోల్‌కతాకు ఆరంభం నుంచే ఎదురుదెబ్బలు తాకాయి. తొలి ఓవర్‌లోనే ప్రత్యర్థులను బెంబేలెత్తించే బౌల్ట్ (1/23) వేసిన ఇన్నింగ్స్ నాలుగో బంతికి సునీల్ నరైన్ (0) క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. రెండో ఓవర్లో చాహర్.. తొలి బంతికే డికాక్ (1)నూ పెవిలియన్‌కు పంపాడు. నాలుగో ఓవర్‌లో సారథి హార్దిక్ నుంచి బంతినందుకున్న అశ్వినీ.. తొలి బంతికే రహానే (11)ను ఔట్ చేసి ఐపీఎల్‌లో తన ఆగమనాన్ని ఘనంగా చాటాడు. రహానే ఇచ్చిన క్యాచ్‌ను డీప్ బ్యాక్‌వర్డ్ పాయింట్ వద్ద తిలక్ వర్మ సూపర్ క్యాచ్ పట్టాడు. చాహర్ ఆరో ఓవర్లో వెంకటేశ్ అయ్యర్ (3)నూ బోల్తా కొట్టించడంతో కేకేఆర్ కష్టాలు రెట్టింపయ్యాయి. ముంబై బౌలర్లపై ఎదురుదాడికి దిగిన రఘువంశీ.. హార్దిక్ వేసిన ఏడో ఓవర్లో నమన్‌కు క్యాచ్ ఇచ్చాడు. 45 పరుగులకే ఐదు కీలక వికెట్లు కోల్పోయిన నైట్ రైడర్స్ తర్వాత ఏ దశలోనూ కోలుకోలేదు. 11వ ఓవర్లో అశ్వినీ.. రింకూ సింగ్ (17), మనీష్ పాండే (19) నూ ఔట్ చేశాడు. రస్సెల్ (5) కూడా అతడి బాధితుడే. ఆఖర్లో రమణ్‌దీప్ పుణ్యమా అని కేకేఆర్ వంద పరుగుల మార్కును దాటింది.

## పాయింట్ల పట్టిక

| జ | మ్యా | గె | ఓ | పా | ర.రే |
|---|---|---|---|---|---|
| బెంగళూరు | 2 | 2 | 0 | 4 | 2.26 |
| ఢిల్లీ | 2 | 2 | 0 | 4 | 1.32 |
| లక్నో | 2 | 1 | 1 | 2 | 0.96 |
| గుజరాత్ | 2 | 1 | 1 | 2 | 0.62 |
| పంజాబ్ | 1 | 1 | 0 | 2 | 0.55 |
| ముంబై | 3 | 1 | 2 | 2 | 0.30 |
| చెన్నై | 3 | 1 | 2 | 2 | -0.77 |
| హైదరాబాద్ | 3 | 1 | 2 | 2 | -0.87 |
| రాజస్థాన్ | 3 | 1 | 2 | 2 | -1.11 |
| కోల్‌కతా | 3 | 1 | 2 | 2 | -1.42 |

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

### సంక్షిప్త స్కోర్లు

కోల్‌కతా: 16.2 ఓవర్లలో 116 ఆలౌట్ (రఘువంశీ 26, రమణ్‌దీప్ 22, అశ్వినీ 4/24, దీపక్ 2/19)

ముంబై: 12.5 ఓవర్లలో 121/2 (రికెల్టన్ 62 నాటౌట్, సూర్య 27 నాటౌట్, రస్సెల్ 2/35)

**1** ఐపీఎల్ అరంగేట్ర మ్యాచ్‌లో 4 వికెట్ల ప్రదర్శన చేసిన తొలి భారత బౌలర్ అశ్వినీ



## జొకోకు జాకుబ్ షాక్

**మియామి ఓపెన్ ఫైనల్‌లో చెక్ కుర్రాడి సంచలనం**

మియామి గార్డెన్స్: ఆధునిక టెన్నిస్‌లో దిగ్గజ ఆటగాడిగా వెలుగొందుతున్న టాప్‌సీడ్ నొవాక్ జొకోవిచ్‌కు మియామి ఓపెన్ సింగిల్స్ ఫైనల్‌లో అనూహ్య షాక్ తగిలింది. 24 గ్రాండ్‌స్లామ్‌లు గెలుచుకున్న ఈ సెర్బియా ప్లేయర్‌కు 19 ఏండ్ల చెక్ రిపబ్లిక్ కుర్రాడు జాకుబ్ మెన్సిక్ ఊహించని షాకిచ్చాడు. ఆదివారం రాత్రి జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్‌లో జాకుబ్.. 7-6 (7/4), 7-6 (7/4)తో జొకోవిచ్‌ను ఓడించి తన కెరీర్‌లో తొలి ఏటీపీ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. రెండు గంటల మూడు నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన ఫైనల్‌లో విజయం కోసం ఇద్దరూ పోరాడారు. రెండు సెట్‌లలోనూ టైబ్రేక్‌ల ద్వారా ఫలితం తేలగా రెండింటిలోనూ జాకుబ్‌దే పైచేయి అయింది.

# వర్త్ వర్మ వర్త్

**ఐపీఎల్‌లో గత సీజన్ నుంచి 'అగ్రెసివ్ అప్రోచ్'తో దుమ్మురేపుతున్న సన్‌రైజర్స్ అమ్ములపొదిలో మరో అస్త్రం చేరింది. బంతిని బాదే పోరులో తానేమీ తక్కువ తిన్లేదంటూ దూసుకొచ్చాడు యువ సంచలనం అనికేత్ వర్మ. ఉప్పల్‌లో లక్నోతో జరిగిన మ్యాచ్‌తో పాటు వైజాగ్‌లో ఢిల్లీతో పోరులో సన్‌రైజర్స్ ప్రత్యర్థి ఎదుట పోరాడగలిగే లక్ష్యాలు ఉంచిందంటే అది అనికేత్ చలవే! 'సిక్సర్లు కొట్టడం ఇంత ఈజీనా?' అన్నట్టుగా సాగుతున్న అనికేత్ క్రికెట్ ప్రయాణంలో ఎన్నో మలుపులు..**

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, హెన్రిచ్ క్లాసెన్, ఇషాన్ కిషన్ వంటి భారీ హిట్టర్లు కలిగిన సన్‌రైజర్స్‌లో బంతిని మరింత బలంగా బాదే దొరికే కుర్రాడు దొరికాడు. ఉన్నఫళంగా టాపార్డర్ విఫలమైనా.. స్లాగ్ ఓవర్స్‌లో రన్‌రేట్‌ను పెంచేందుకు లోయరార్డర్‌లో ఓ బ్యాటర్ ఉండాలన్నా.. 'వెతకబోయిన తీగ కాలికి దొరికినట్టు'గా దొరికాడు అనికేత్ వర్మ. ఉత్తరప్రదేశ్‌లోని ఝూన్సీలో పుట్టి భోపాల్‌లో క్రికెట్ ఓనమాలు దిద్దుకుని దేశవాళీలో మధ్యప్రదేశ్ తరఫున ఆడుతున్న 23 ఏండ్ల ఈ కుర్రాడు.. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ వెలికితీసిన మరో ఆణిముత్యం.

### సిక్స్ మాస్టర్

లక్నోతో మ్యాచ్‌లో 12 ఓవర్లకే నలుగురు టాపార్డర్ బ్యాటర్లు పెవిలియన్‌కు చేరడంతో క్రీజులోకి వచ్చిన అనికేత్.. 13 బంతుల్లోనే 36 పరుగులు రాబట్టాడు. ఇందులో ఏకంగా ఐదు సిక్సర్లున్నాయి. క్రీజును వదలకుండా ఉన్నచోటే సిక్సర్లు కొట్టడం అతడికి వెన్నతో పెట్టిన విద్య. ఈ ప్రదర్శనతో ఢిల్లీతో మ్యాచ్‌లో అతడికి బ్యాటింగ్ ప్రమోషన్ లభించింది. స్టార్క్ దెబ్బతో 25 పరుగులకే 3 వికెట్లు కోల్పోవడంతో క్రీజులోకి అడుగుపెట్టిన అనికేత్.. 'ఫియర్‌లెస్ అప్రోచ్'తో దంచికొట్టాడు. అతడి బాదుడుకు ఢిల్లీ సారథి అక్షర్ బాధితుడిగా మిగిలాడు. ఢిల్లీతో మ్యాచ్‌లో అతడు 74 రన్స్ చేస్తే అందులో సిక్సర్లు (6), బౌండరీలు (5) రూపంలో వచ్చినవే 50 పరుగులు. చూడటానికి బక్కపలచగా ఉన్నా అలవోకగా సిక్సర్లు బాదేందుకు కఠోర సాధన చేశానంటాడు అనికేత్. గత రెండు ఇన్నింగ్స్‌లలో అతడి మెరుపులే ఇందుకు నిదర్శనం.

### అలా వెలుగులోకి..

చిన్నప్పుడే అమ్మ చనిపోవడంతో మామయ్య అమిత్ వర్మ దగ్గర పెరిగిన అనికేత్.. పసి ప్రాయం నుంచే క్రికెట్‌పై మక్కువ పెంచుకున్నాడు. అతడి ఆసక్తిని గమనించిన అమిత్.. డబ్బులకు వెనుకాడకుండా శిక్షణ ఇప్పించాడు. పదేండ్ల ప్రాయంలో భోపాల్‌లోని అంకుర్ క్రికెట్ అకాడమీలో కోచ్ జ్యోతి ప్రకాశ్ త్యాగి వద్ద చేరడం అనికేత్ క్రికెట్ కెరీర్‌లో కీలక మలుపు. ఓసారి అండర్-12 స్థాయిలో అనికేత్ 256 పరుగులు చేయగా అతడి కోచ్ వచ్చి 'ఏదో ఒకరోజు నువ్వు 400 పరుగులు చేస్తావు' అని చెప్పాడట. అది అనికేత్‌లో కసిని మరింత పెంచింది. కోచ్ మాటలను నిజం చేస్తూ రెండేండ్ల క్రితం ఓ ఇంటర్ డివిజనల్ మ్యాచ్‌లో చంబల్‌పై అతడు 400 (ఇందులో 41 బౌండరీలు, 16 సిక్సర్లున్నాయి) రన్స్ చేశాడు. ఈ ప్రదర్శనే మధ్యప్రదేశ్ లీగ్ (ఎంపీఎల్)లో ఫ్రాంచైజీల కన్ను ఈ కుర్రాడిపై పడేలా చేసింది. 2024 సీజన్‌లో అనికేత్ ఫేత్ క్రికెట్ క్లబ్ తరఫున ఆడుతూ ఆ సీజన్‌లో టాప్ స్కోరర్ (273)గా నిలిచాడు. ఒక మ్యాచ్‌లో 32 బంతుల్లోనే సెంచరీ బాదాడు. ఈ టోర్నీలో అనికేత్ మొత్తం 25 సిక్సర్లు కొట్టడం విశేషం. అనికేత్ ప్రతిభను గుర్తించిన ఎస్‌ఆర్‌హెచ్ బృందం.. వేలంలో అతడిని రూ. 30 లక్షలకు దక్కించుకుంది. పెట్టిన ప్రతి పైసాకూ న్యాయం చేస్తున్న ఈ కుర్రాడు ఇదే జోరు కొనసాగిస్తే ఎస్‌ఆర్‌హెచ్‌లో స్థానాన్ని సుస్థిరం చేసుకోవడం లాంఛనమే!






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.